## వ్యాక్సినేషన్ తప్పనిసరి

నర్సాపూర్, జూలై 3 : గర్భిణులు, చిన్నపిల్లలకు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయించుకోవాలని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ వరలక్ష్మి అన్నారు. బుధవారం గుంజాల ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని సోంజిగూడలో గర్భిణులు, పిల్లలకు టీకా వేశారు. వైద్య సిబ్బంది హేమబిందు, విద్యారాణి, అంగన్‌వాడీ టీచర్ జయశీల, ఆశాకార్యకర్త సత్యశీల పాల్గొన్నారు.

## రిమ్స్‌లోని డీ అడిక్షన్ సెంటర్ సందర్శన

ఎదులాపురం, జూలై 3 : రిమ్స్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌ను బుధవారం జిల్లా సంక్షేమ అధికారి సబిత సందర్శించారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారిన వారిలో పరివర్తన తీసుకురావడానికి రిమ్స్‌లో మానసిక వైద్యనిపుణుడు ఓంప్రకాశ్ ఆధ్వర్యంలో వార్డు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వార్డును సందర్శించిన చికిత్స పొందుతున్న వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, వసతుల వివరాలను పరిశీలించిన నివేదికను కలెక్టర్ రాజర్షి షాకు అందజేయడం జరుగుతుందన్నారు.

## హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్ ప్రారంభం

ఎదులాపురం, జూలై 3 : టీఎస్ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్‌ను ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు డీఎం కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు హెవీ మోటార్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి డిపో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 7382840349ను సంప్రదించాలని సూచించారు.

## ప్రైవేటు పాఠశాలల తనిఖీ

బోథ్, జూలై 3 : మండలంలోని ప్రైవేట్ పాఠశాలలను బుధవారం మండల విద్యాధికారి అనిల్‌రెడ్డి భూమారెడ్డి తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేదం, విజ్ఞాన్, యూటర్న్, సెయింట్ శివ మందిర్, నాగభూషణం పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో వసతులపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం అవసరమైన వసతులు ఉన్నాయని పరిశీలించారు.

## వితంతువు పింఛన్ ఇప్పించాలి

ఇచ్చోడ, జూలై 3 : ముక్రా(బీ) గ్రామపంచాయతీ పరిధిలోని రఘునగర్, మన్నుగూడకు చెందిన ఎస్టీ గూడల్లో భర్త చనిపోయి 8 సంవత్సరాలు గడుస్తున్న తనకు వితంతువు పింఛన్ రావడం లేదని, పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ15 మంది వితంతువులు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మికు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ మారుతి, నైతం రుపాబాయి, కుడ్మెత నాగుబాయి, దుర్గబాయి, రాధాబాయి, దేవుబాయి, సుంబాయి ఉన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో పీఈటీ పోస్టు భర్తీ

గుడిహత్నూర్, జూలై 3 : మండలంలోని మన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో భర్తీ అయింది. ఆ పాఠశాలలో మొత్తం 450 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జూన్ 25న ఎమ్మెల్యే ఆ పాఠశాలను సందర్శించినప్పుడు ఆ పాఠశాల హెచ్ఎం, గ్రామ ప్రముఖులు పీఈటీ పోస్టు ఖాళీగా ఉంది భర్తీ చేయించాలని విజ్ఞప్తి చేయగా వారం రోజుల్లో భర్తీ చేయిస్తానని మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు. హెచ్ఎం సంతోష్, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

ఇచ్చోడ, జూలై 3 : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సాగర్, ఎంపీవో సాయిప్రసాద్, కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: ఎంపీపీ పోటే శోభబాయిని సన్మానిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ప్రజాప్రతినిధులు



నేరడిగొండ: ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు, సిబ్బంది

# అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు సన్మానం

ఇంద్రవెల్లి, జూలై 3: ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పదవీ కాలం ముగిసిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఆత్మీయ సన్మాన మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించి నాగోబా ఫొటోతో కూడిన ప్రత్యేక బహుమతిగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మండల ప్రజా ప్రతినిధులను శాలువాతో సన్మానించి వారికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శోభాబాయి, జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అమ్జద్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

### ఐక్యతతోనే మండలాభివృద్ధి సాధ్యం

జైనథ్, జూలై 3 : పార్టీలకు అతీతంగా ఐక్యతతోనే మండల సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ గోవర్దన్ అన్నారు. జైనథ్‌లోని రైతు వేదికలో ఎంపీపీ, ఎంపీటీసీలను అధికారులు, నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరుంధతి వెంకట రెడ్డి, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవన్న, గిమ్మ ఎంపీటీసీ భోజన్న, తహసీల్దార్ శ్యాం సుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, సూపరింటెండెంట్ ముత్యంరావ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

### రాజకీయాల్లో పదవీ విరమణ సహజమే

నేరడిగొండ, జూన్ 3 : రాజకీయాల్లో పదవీ విరమణ అనేది సహజమేనని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. ఎంపీటీసీల ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగియడంతో నేరడిగొండలోని ఎంపీడీవో కార్యాలయంలో వారిని స్థానిక నాయకులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో రజ్వీర్, ఎంపీవో లక్ష్మణ్, సూపరింటెండెంట్ చక్రపాణి, పీహెచ్‌సీ వైద్యుడు సద్దాం, ఐకేపీ ఏపీఎం ఉత్తమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, ఈజీఎస్ ఏపీవో వసంత్ రావ్, తదితరులు పాల్గొన్నారు.



దస్తురాబాద్ : జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

తలమడుగు, జూలై 3 : మండలకేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ, ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాంసి(భీంపూర్), జూలై 3 : భీంపూర్‌లోని రైతు వేదికలో ఎంపీడీవో ఆధ్వర్యంలో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, ఎంపీపీ రత్నప్రభ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ రావ్, వైస్ ఎంపీపీ లస్మన్న, నాయకులు పాల్గొన్నారు.

పెంబి, జూలై 3: పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ భూక్యా కవిత, జడ్పీటీసీ జానుబాయి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీటీసీలు సల్లా గోదావరి, రామరావ్‌ను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోతో పాటు సిబ్బంది శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు, ఏపీవో రాజశేఖర్, ఏపీఎం గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్ రూరల్, జూలై 3: ఖానాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులను మండల అధికారులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, ఎంపీపీ మొహిద్, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, వైస్ చైర్మన్ కావలి సంతోష్, ఎంపీటీసీలు, ఎంపీవో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తానూర్, జూలై 3 : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలను మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్, సిబ్బంది శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, నాయకులు రాజన్న, పోతారెడ్డి, చంద్రకాంత్‌యాదవ్, మాజీ సర్పంచ్ జాదవ్ మాదవ్‌రావు పటేల్, గోవింద్‌పటేల్ పాల్గొన్నారు.



కుంటాల: ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

### అధికారం, పదవులు శాశ్వతం కాదు

దస్తురాబాద్,జూలై 3 : అధికారం,పదవులు శాశ్వతం కాదని, గెలిచిన, ఓడిన నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమేశ్ ఆధ్వర్యంలో జడ్పీటీసీ సంతపూరి శారద, ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ భూక్యా రాజు నాయక్, ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు. అంతకు ముందు ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సర్ఫారాజ్ నవాజ్, డీటీ యాదవ రావు, ఎంపీవో అనిల్ కుమార్, ఆయా శాఖాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, మండల యూత్ అధ్యక్షుడు నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

సోన్, జూలై 3: సోన్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బర్ల మానస హరీశ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నాగయ్య, ఎంపీటీసీలు దాసరి లింగవ్వ, రాజేశ్వర్, మారమల్కవ్వను కార్యాలయ సిబ్బంది శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు ఎంపీవో కలీం, ఏపీవో మంజుల, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సారంగాపూర్, జూలై 3: సారంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎంపీటీసీ సామల పద్మను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంపీటీసీల ఐదు సంవత్సరాల పదవీ కాలం పూర్తి కావడంతో శాలవాతో సత్కరించారు. హెచ్ఎం గణేశ్, ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, శేఖర్, హన్మాండ్లు, శ్రీదేవి, ప్రవళిక పాల్గొన్నారు.

లక్ష్మణచాంద, జూలై 3: మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో ఎంపీటీసీల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అడ్వాల పద్మ ఆద్వర్యంలో ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో నసీరొద్దీన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల, జూలై 3 : కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అప్క గజ్జారాం, వైస్ఎంపీపీ పసుల మౌనిక, ఎంపీటీసీలు సుధాకర్, కట్ట రవి, సవిత, దాసరి మధు, కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌లకు ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకుముందు ఎంపీపీ గృహానికి వెళ్లి మాజీ చైర్మన్ జుట్టు అశోక్ ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రహీం, మండల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

ఇచ్చోడ(సిరికొండ), జూలై 3 : సిరికొండలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఆయా శాఖాధికారులు మండల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాల గంగాధర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా వైద్యాధికారులకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఎంపీవో సంతోష్ కుమార్, ఏవో జాదవ్ కైలాస్, ఎంపీపీ అమృత్‌రావ్, వైస్ ఎంపీపీ సాగరిక, జడ్పీటీసీ చంద్రకళ, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## వెంచర్లపై రెవెన్యూ అధికారుల దాడులు

సారంగాపూర్, జూలై 3: మండలంలోని జామ్, అడెల్లి, బీరవెల్లి గ్రామాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లపై బుధవారం రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. సాగు భూముల్లో వెంచర్లకు ఏర్పాటు చేసి ప్లాట్లు అమ్ముకుంటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్న నేపథ్యంలో, నాలా పర్మిషన్ కూడా లేనందున రాళ్లను పూర్తిగా తొలగించారు. అనుమతులు వచ్చే వరకు వెంచర్లలో ఎలాంటి పనులు చేపట్టరాదని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ కొని నక్క మృతి

భైంసాటౌన్, జూలై 3 : రోడు ప్రమాదంలో నక్క మృతి చెందిన ఘటన భైంసా మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భైంసా-నిర్మల్ జాతీయ రహదారిపై మాటేగాం గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న నక్కను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన స్థలానికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు పంచనామా చేసి ఖననం చేశారు.

## దొంగను పట్టుకున్న గ్రామస్తులు

భైంసా టౌన్, జూలై 3: మండలంలోని ఎగ్గాం గ్రామంలో మోటర్ కేబుల్ వైర్ల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని బుధవారం గ్రామస్తులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భైంసాకు చెందిన జల్లికర్ ముత్యం మోటరు కేబుల్ వైర్లను దొంగతనం చేసి సమీప వాగులో వైర్లను కాలుస్తుండగా గ్రామస్తులు పట్టుకొని సమాచారం అందించారు. నిందితునిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

## నేడు డయల్ యువర్ డీఎం

నిర్మల్ అర్బన్, జూలై 3 : నిర్మల్ డిపో పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను నేరుగా తెలుపవచ్చని, బస్సు సమయాలు, నూతన రూట్లు, సలహాలు, సూచనలు కూడా ఇవ్వొచ్చని పేర్కొన్నారు. 9959226003 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు మాట్లాడొచ్చని తెలిపారు.

## ప్లాస్టిక్ వాడకం నిషేధం

ఖానాపూర్, జూలై 3: చిరు వ్యాపారులు, దుకాణాదారులు 120 మైక్రన్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగించినట్లయితే రూ.5 వేల నుంచి 25 వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మనోహర్ హెచ్చరించారు. ఇందుకు వ్యాపారస్తులు, ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

## విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతి

ఎదులాపురం, జూలై 3 : మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో బుధవారం విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ముజాహిద్ తెలిపారు. బజార్‌హత్నూర్ మండలం భూతాయికి ఫడ్ బాలాజీకి కుమారుడు గోపాల్ (14) కాలనీలో ఆడుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు రఫీక్ ఇంటి కిటికికి అమర్చిన కూలర్‌ను ముట్టుకున్నాడు. కూలర్‌కు కరెంట్ సరఫరా అవుతుండటంతో విద్యుత్‌షాక్ తగిలి పక్కనే ఉన్న మురుగుకాలువలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కూలర్ ఏర్పాటు చేసి నిర్లక్ష్యంగా వదిలేసిన రఫిక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## జిల్లా జైలు నుంచి ముగ్గురు ఖైదీలు విడుదల

ఎదులాపురం, జూలై 3 : హత్యాయత్నం కేసులో జీవిత ఖైదీగా అనుభవిస్తున్న ముగ్గురు ఖైదీలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఆదిలాబాద్ జిల్లా జైలులో13 సంవత్సరాలుగా శిక్ష అనుభవిస్తున్న ముగ్గురు ఖైదీలను విడుదల చేశామని జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ అదేశాల మేరకు విడుదలైన ఖైదీలో ఒకరికి జైలులో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో ఉపాధి, మరో ఇద్దరు తమ వ్యవసాయం చేసుకుంటామని చెప్పడం జరిగిందని పేర్కొన్నారు.

## ప్లాస్టిక్ దుకాణాల్లో సోదాలు

భైంసా, జూలై 3 : భైంసాలోని పలు ప్లాస్టిక్ దుకాణాల్లో బుధవారం మున్సిపల్ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్ మాట్లాడుతూ 60 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీన పరుచుకోవడం జరిగిందన్నారు. కావున ప్లాస్టిక్ కట్టడికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందులో సిబ్బంది మోతీరాం, గంగాచారి, అమీర్, అజీమ్ ఉన్నారు.

## జీలుగ పంట పరిశీలన

నర్సాపూర్(జీ), జూలై 3: తిమ్మాపూర్(జీ) గ్రామంలోని పచ్చిరొట్ట జీలుగ పంటను జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట రైతు ఉదిగిరి లస్మన్న, వ్యవసాయ విస్తరణాధికారి గణేశ్ ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ముథోల్, జూలై 3 : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ముథోల్ మండల ప్రత్యేకాధికారి సుదర్శన్ అన్నారు. బుధవారం ముథోల్‌లోని ఎంజీజేబీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించి, వారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాములు, ఎంపీవో అమీర్ ఖాన్, ఏపీవో శిరీష ఉన్నారు.

## విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

ఉట్నూర్, జూలై 3 : గిరిజన విద్యార్థులకు ఆశ్రమాల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా ఆదేశించారు. బుధవారం ఉట్నూర్‌లోని ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వైద్యం, విద్యా, భోజన సౌకర్యాలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిష్టర్లు, వంట గదులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆశ్రమ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## నేడు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

తలమడుగు, జూలై 3 : ఆదిలాబాద్‌లోని ఎస్టీయూ భవన్‌లో గురువారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ తోట వెంకటేశ్ తెలిపారు. అలాగే సాయిలింగి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## కోతుల దాడిలో విద్యార్థులకు గాయాలు

బోథ్, జూలై 3 : పొచ్చెరలోని పాఠశాలలో బుధవారం కోతుల దాడిలో నాలుగో తరగతి, ఆరో తరగతి చదువుతున్న చైత్ర, పూజితకు గాయాలయ్యాయి. ఆయా పాఠశాలలో పిల్లలు ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కోతులు మీద పడి గాయపర్చాయి. విద్యార్థులను చికిత్స నిమిత్తం దవాఖానకు తీసుకెళ్లారు. పాఠశాల చుట్టు పక్కల కోతుల నివారణకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పిల్లలు భిక్షాటన చేస్తే సమాచారం ఇవ్వండి

కుంటాల, జూలై 3 : 17 సంవత్సరాలు నిండలేని వారిని హోటల్, కిరాణా, ఇతర దుకాణాల్లో పనిలో పెట్టుకుంటే పెట్టుకున్న వారికి, తల్లిదండ్రులకు కఠిన చర్యలు ఉంటాయని భైంసా డివిజన్ బాలల న్యాయ సలహాదారు షేర్ నరేందర్ అన్నారు. బుధవారం కల్లూరులో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. వివిధ దుకాణాల్లో బాల కార్మికులుగా పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు లేని పిల్లలు గాని, దుకాణాల్లో బస్టాండ్‌ల్లో భిక్షాటన చేసే పిల్లలు ఉంటే 1098 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. భైంసా డివిజన్ ఇన్‌చార్జి షేర్ నరేందర్, ఎస్ఐ నారాయణ్ సింగ్, కానిస్టేబుల్ రాందాస్, ఎస్‌డీ హరీశ్, అనుప్రియ, ఐసీపీఎస్ సిబ్బంది మమత, చైల్డ్ లైన్ సిబ్బంది కవిత, కల్లూరు వీడీసీ చైర్మన్ సీహెచ్ వెంకట్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతుల అభిప్రాయాలు ప్రభుత్వానికి అందజేస్తాం

జైనథ్, జూలై 3 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ సేకరణను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుంధతి రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ప్రజలతో మమేకమై సేవలందించాలి

బజార్‌హత్నూర్, జూలై 3: శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలతో మమేకమై సేవలందించాలని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. బుధవారం బజార్‌హత్నూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. మండలంలోని క్రైం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లోని లాకప్‌రూం, రిసెప్షన్ సెంటర్, రైటర్ గదులతో పాటు చుట్టు ఉన్న పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. గ్రామంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో కొంత మేరకు అసహనం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం దగ్గరగా ఉండడంతో ఎల్లవేళలో నిఘానేత్రం పనితీరును పటిష్టంగా ఉంచాలన్నారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆయన వెంట ఎస్ఐ నరేశ్, ఏఎస్ఐ ధారసింగ్, సిబ్బంది సంపత్, సంజయ్, విజయ్ ఉన్నారు.

## భూ తగాదా ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి

లోకేశ్వరం, జూలై 3: లోకేశ్వరం మండలం హవర్గ గ్రామానికి చెందిన పర్స భోజన్న (54)పై అదే గ్రామానికి చెందిన సింధే లక్ష్మణ్– గోదావరి దంపతులు గత నెల 24న దాడి చేశారు. ఆ సమయంలో తీవ్రంగా గాయపడిన భోజన్ననునిర్మల్‌కు తరలించగా ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. దాడికి పాల్పడిన నిందితులను అదే రోజు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఎమ్మెల్యే కోవ లక్ష్మిని టార్గెట్ చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నార్నూర్, జూల్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని అహంకారంతో ఆదివాసీ ముద్దుబిడ్డ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని టార్గెట్ చేసి కించపరిచేలా వ్యవహరిస్తే సహించబోమని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తొడసం నాగోరావ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా చేపట్టే కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకపోవడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సురేశ్, ఐటీడీఏ డైరెక్టర్ మడావి మాన్కు, మోహన్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## దేవస్థానాల అభివృద్ధికి కృషి

తలమడుగు, జూలై 3 : ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని, అన్ని దేవస్థానాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అర్లి(కే) గ్రామంలో ఎంపీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన సవారీ బంగ్లా షెడ్, సుంకిడి గ్రామంలో రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన సవారీ బంగ్లా షెడ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రెయర్ బ్యాండ్‌ను జడ్పీటీసీ, ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాబన్న, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు బాబు ఖాన్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కె.ప్రతాప్, మాజీ సర్పంచ్ కిష్టన్న, మహేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోక భూమారెడ్డి, ప్రకాష్ రావ్, అశోక్, ప్రవీన్ రెడ్డి, సాంబశివ్, వెంకట్ రెడ్డి, రాకేశ్, విలాస్ యాదవ్, సుభాష్ పాల్గొన్నారు.


## రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలి



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్(జీ), జూలై 3: రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలి ఇండియా కూటమి లోక్‌సభ పక్షనేత రాహుల్‌గాంధీ హిందువులకు వెంటనే క్షమాపణ చెప్పాలని బుధవారం బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. పార్లమెంట్‌లో హిందువులపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నర్సాపూర్(జీ)లో జాతీయ రహదారిపై ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ మాట్లాడుతూ రాహుల్ వ్యాఖ్యలు దేశంలో హైందవ ధర్మాన్ని ఆచరిస్తున్న కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బ తీశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాగర్, అర్జున్, బర్కుంట నరేందర్, మండల నాయకులు అర్జున్, దత్తురాం, లక్ష్మణ్, మహేశ్, సాయికృష్ణ, రవీందర్, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిధుల మంజూరుకు కృషి చేస్తా



చెక్కులు పంపిణీ చేస్తున్న నిర్మల్ ఎమెల్యే

నిర్మల్ అర్బన్, జూలై 3 : నిర్మల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎమెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్‌లోని జయశంకర్ చౌరస్తా వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌తో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ టౌన్, నిర్మల్ రూరల్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జీ), మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖల అదికారులు, తహసీల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.

సోన్, జూలై 3: సోన్ మండలంలోని ఆయా గ్రామాల్లోని 17 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బర్ల మానస-హరీశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### అన్నివర్గాల సంక్షేమానికి కృషి

లక్ష్మణచాంద, జూలై 3: అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 73 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, తొమ్మిది మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బీజేపీ మండలాధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు ముత్యం రెడ్డి, గంగన్న, అనిల్, రంజిత్ పాల్గొన్నారు.

సారంగాపూర్, జూలై 3: మండల కేంద్రంలోని రైతువేదికలోఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి 61 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, బీజేపీ మండలాధ్యక్షుడు కరిపె విలాస్, నాయకులు రాంశంకర్‌రెడ్డి, మోహన్, పోతన్న, తిరుమలచారి, సాహెబ్‌రావు, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

జైనథ్(బేల), జూలై 3: బేల మండలం మాంగ్రోడ్ గ్రామంలో డబుల్ బెడ్రూం గృహప్రవేశం, ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.23 లక్షలతో వాటర్ ట్యాంక్, ప్రతి ఇంటికి నల్లతో నీటి సౌకర్యం, అమ్మ ఆదర్శ పాఠశాల రూ.3లక్షలతో మరాఠీ మీడియం, రూ.2.95 లక్షలతో ఐటీడీఏ పాఠశాలకు చెందిన పనులను ఎంపీపీ వనితా ఠాక్రే ప్రారంభించారు. అనంతరం ఎంపీటీసీలను మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీప రాధాకృష్ణ, గ్రామ సమైక్య అధ్యక్షురాలు విద్యాబాయి, పంచాయతీ కార్యదర్శి మౌని, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరిశ్చంద్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ని చూసుకుంటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రచురించేందుకు ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధమూ లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677